రోమ్ తగలడుతుంటే నీరో ఫిడేల్ వాయించుకున్నాడు. నీరోకి తగ్గని హీరోలేం చేశారు?

# ఎమ్మేయత్



తూరుప్పేటలో యిళ్ళంటుకున్నాయి.

ఊరంతా వుడికిపోయింది.

అసలే వేసవి. అందులో రోహిణి.

బావినీళ్ళు పాతాళం చూస్తున్నాయి.

మంటలతో ఆకాశం ఎఱ్రబడింది.

నేల ఉడికిపోయింది.

గాలి వేడెక్కింది.

ఊళ్లోవున్న ఒక్క ఫైరింజనూ రిపేరులో వుంది.

వంద కుటుంబాలు రోడ్డు పాలయ్యాయి.

ఆడుతున్న మిల్లు ఆపేసి నాయుడప్పలస్వామి జీపులో హుటాహుటిన తూరుప్పేటకి వెళ్ళాడు.

మావిడికాయ ల్లోడింగు చెయ్యటం ఆపేసి చిన వెంకటరాయుడు మోటరు సైకిలు మీద నేరుగా తూరుప్పేట చేరుకున్నాడు. ఆ పేటలో యిద్దరికీ చెరి సగం ఓట్లున్నాయి.

* * *

పేటకి నాలుగు ఫర్లాంగుల దూరంలో జీపు ఆపాల్సివచ్చింది.

మోటరు సైకిలు మరో రెండు ఫర్లాంగులు ముందుకు వెళ్ళగలిగింది.

కట్టు గుడ్డలతో బైటపడిన తూరుప్పేట ఓటర్లు గగ్గోలు పెడుతున్నారు.

దేవుడనే ప్రజానాయకుడి ఆధ్వర్యంలో సామూహిక చితులంటించిన శ్మశానంలా వుంది ఆ చోటు.

అప్పలస్వామి పేరు పేరునా పలకరిస్తూ పెద్దలందర్నీ ఓదార్చాడు.

వెంకటరాయుడు మరికాస్త చొరవ చేసి ఆడ ఓటర్లకి వూరట కలిగించాడు.

ఎండవేడికి, మంటల తాకిడికి తట్టుకోలేక ఎలుగెత్తి ఏడుస్తున్న భావి ఓటర్లని మాత్రం ఎవరూ పట్టించుకోలేదు.

* * *

చిన్న గాంధీ బొమ్మ దగ్గర ఇరు వర్గాల వారు కలిసి అర్జంటు మీటింగు ఏర్పాటు చేశారు.

స్వామి, రాయుడు యిద్దర్లో ఎవరు అధ్యక్షత వహించాలో తేలక సభ మొదలవటం కాస్త ఆలస్యమైంది.

ఓ పక్క యిళ్ళు తగలడుతుంటే అధ్యక్షు డెవరని వాదించుకోటం తగదనీ, యిద్దరూ అధ్యక్షులే, ఇద్దరూ వుపన్యాసకులే అనీ-సగం పడిపోయిన పంచాయతీ కాంపౌండ్ గోడమీద కూచుని తీర్పు చెప్పాడు కరణం.

పూలదండలు దొరకని కారణాన నూలు దండలతో సభ నిరాడంబరంగా మొదలయింది.

ముందుగా "నాయుడప్పలస్వామిగారు మాటాడతారు" అని రాయుడుతనఔదార్యం ప్రకటించాడు.

అప్పలస్వామి లేచి కళ్ళు తుడుచుకున్నాడు.

"తూరుప్పేట మన వూరికి వెన్నెముకలాంటిది. ఈ పేట ఒక్కపూట పనిపాటల్లోకి కదలిరాకపోతే వూరికి పొద్దుపొడవదు. ఇవాళ్టి అగ్ని ప్రమాదంవల్ల జరిగిన నష్టం నా అంచనా ప్రకారం అయి



శిల్ప సుందరి కూడ
చిరుదివ్వె వెలిగించింది!
చిత్రం : పి.వి. సాయిరాం, కోవూరు

దారు లక్షలుంటుంది. కూలీనాలీ చేసుకు బతికే ఈ జనం ఈ నాడు రోడ్డు పాలవటానికి కారణం ఎవరు.... ఎవరు అని నేను ప్రశ్నిస్తున్నాను...." అప్పలస్వామి వుద్రేకం తమాయించుకోటానికి ఒక్క-క్షణం ఆగాడు.

"ఇంకెవరు చినవెంకట రాయుడే కారణం" అనబోతున్నాడని పసిగట్టిన కరణం కంగారుగా గోడ మీంచి దూకి అప్పలస్వామి కాలుగోకి 'అగ్నిహోత్రుడే కారణం' అని అందించాడు.

"ఆ....అదీ....దీని కంతటికీ అగ్నిహోత్రుడే కారణం. ఇలాంటి అగ్నిప్రమాదాలు జరక్కుండా తూరుప్పేటనీ, మన వూరినీ, దేశాన్నీ కాపాడుకోటానికి మనం గట్టిచర్యలు తీసుకోవాలి. నేను గౌరవనీయులైన మన ఎమ్మెల్లేగారితో మాట్లాడి, అవసరమైతే పోట్లాడి, తక్షణమే అగ్నిప్రమాదాల నివారణకి శాశ్వత పథకం రూపొందించే ప్రయత్నం చేయివలసిందిగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకి గట్టిగా చెప్పమని చెబుతానని మీ అందరికీ హామీ యిస్తున్నాను."

జనం చప్పట్లు కొట్టారు. ఒక్క-సారి ఓటర్లందరివంకా తృప్తిగా చూసి "జైహింద్" అని కూచున్నాడు అప్పలస్వామి.

చినవెంకట రాయుడు లేచేడు "అగ్నిప్రమాదాల శాశ్వత నివారణ అనే సమస్య యివాళ తేలేదికాదు. మనం వెంటనే తూరుప్పేట ఓటర్లని ఆదుకోవాలి. తిండీ బట్టా యిచ్చి వారిని బతికించాలి. దానికిమీరంతా పూనుకుని ధన వస్తు రూపేణా సేకరణ చెయ్యాలి. స్వచ్ఛందంగా యివ్వాలి."

జనం చప్పట్లు కొట్టారు. డబ్బు, బట్టలు అక్కడి కక్కడ పోగుబడ్డాయి. రాయుడు ఉత్తరీయమే కాక చొక్కా-కూడా తీసేసి గుట్టలో పడేస్తుంటే "రాయుడు గారికి జై" అని ఆర్తనాదాలు చేశారు. జనం.

"దొంగముండా కొడుకు.... యిందుకే ముందు నన్ను మాటాడమన్నాడు." అనుకున్నాడు అప్పలస్వామి అగ్నిహోత్రుడిలా ఎర్రగాచూస్తూ.

రాయుడికి అప్పలస్వామి నీరసంచూసి వీరావేశం వచ్చింది.

గొంతు పెరిగింది. అక్కడక్కడా దుఃఖంతో పూడుకుపోయింది.

"ఆనక ఆ దీన మానవులను కాపాడే నిమిత్తం వారికి గృహ నిర్మాణం చేసే పథకం చేపట్టాలి. అందుకుగాను నేను ఉత్తరాన వున్న నా రెండెకరాల స్థలాన్ని తూరుప్పేట ఓటర్లకు వుచితంగా యిస్తున్నాను. గాంధీ గారికీ జై" అని కరతాళ ధ్వనుల మధ్య చెవులు దిబ్బెడేసి కూచున్నాడు రాయుడు.

గృహ నిర్మాణ పథకం తనకు తట్టనందుకు నెత్తి కొట్టుకున్నాడు అప్పలస్వామి. "చెప్పద్దుటయ్యా దేభ్యం మొహం నువ్వూను" అన్నట్టు కరణంవంక కొరకొరా చూశాడు.

అప్పలస్వామి చెవిలో కరణం ఏదో వూదటంతో ఆయన మొహం శంకుస్థాపన రాయిలా విశాలంగా వెలిగిపోయింది.

సోదర సోదరీమణులారా! మిత్రుడు రాయుడు చూపిన వితరణకి ఆనందిస్తున్నాను, అభినందిస్తున్నాను. అలాగే పడమట దిక్కునగల నా రెండెకరాల స్థలాన్ని కూడా తూరుప్పేట ఓటర్ల గృహనిర్మాణం కోసం ఉచితంగా యిస్తున్నాను. అంతే కాకుండా రాయుడి స్థలంలోను, నా స్థలంలోను ఓ వంద యిళ్ళు కట్టే కాంట్రాక్టుకి నేను వుచితంగా పనిచేస్తానని కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. గృహ నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయం ప్రభుత్వం వెంటనే మంజూరు చేసేలా కృషి చేస్తాననికూడా వాగ్దానం చేస్తున్నాను."

చప్పట్లు, ఈలలు, కేకలు.

* * *

హైదరాబాదుకి టెలిఫోన్లు. ఢిల్లీకి టెలిగ్రాములు ప్రవహించాయి. "అనాథులను ఆదుకోండి. తక్షణం సహకరించి మానవత్వం నిలబెట్టుకోండి."

"మీరిచ్చే దానం దీనమానవాళికి వరదానం."

ఊరంతా మైకులు మోగిపోయాయి. చినవెంకటరాయుడి పార్టీ కార్యదర్శి అప్పురెడ్డి, అప్పలస్వామి పార్టీ ఉపాధ్యక్షుడు చెంచురామయ్య తమకున్న అత్యవసర కార్యక్రమాలన్నీ రద్దుచేసుకుని తూరుప్పేటలో జరిగిన నష్టాన్ని మదింపు చెయ్యటానికి, సహాయ కార్యక్రమాలు చేపట్టడానికి రైల్లో కలిసిన్నీ, కారుల్లో విడివిడిగా సున్నూ విచ్చేశారు.

తూరుప్పేట సందర్శించారు.

ఓటర్ల కన్నీటి గాథలు విన్నారు. విచారించారు.

వారి హృదయాలు ద్రవించాయి.


వారి కనులు కన్నీటిని స్రవించాయి.

సానుభూతి వాక్యాలు విద్యుత్తులా ప్రవహించాయి.

* * *

చినవెంకటరాయుడు పెదగాంధీ బొమ్మ దగ్గర అప్పురెడ్డి అధ్యక్షతన మీటింగు పెట్టాడు.

"నాయుడప్పల స్వామి చెప్పే మాటలు నమ్మకండి. తూరుప్పేటలో జరిగిన నష్టాన్ని అంచనా వెయ్యటానికి ఎవరికీ



సాధ్యం కాదు. ధన నష్టం కాదు ముఖ్యం. జరిగిన జన నష్టం....తలుచుకుంటే కడుపు దేవేస్తోంది" —రాయుడు గొంతు పూడుకుపోయింది. అప్పురెడ్డి ఆయన భుజం తట్టి ఓదార్చాడు

రాయుడు దుఃఖం నించి తేప్పరిల్లి— "కాంట్రాక్టుడచితంగా చేస్తానన్న నాయుడి మాట నమ్మకండి. ఇళ్ళ నిర్మాణంలో డబ్బు మిగుల్చుకోటానికి వేసిన ఎత్తు. ఏనాటికైనా పీడిత తాడిత ప్రజానీకానికి అండదండలుగా వుండేది మా పార్టీయేనని నేను చెబుతున్నాను. ఇందుకు ఏమీ సందేహించడం లేదనికూడా నేను చెబుతున్నాను. మా పార్టీ తూరుప్పేట ఓటరొక్కంటికీ వారంరోజులపాటు రోజొక్కంటికీ కిలో బియ్యం చొప్పున యివ్వటానికి నిర్ణయించిందని యిప్పుడే మా పార్టీ కార్యదర్శి గౌరవనీయులు శ్రీ అప్పురెడ్డిగారు చెప్పారు. ఆ కార్యక్రమానికి ప్రారంభోత్సవం జరపవలసిందిగా అప్పురెడ్డిగారిని కోరుతూ విరమిస్తున్నాను."

అప్పురెడ్డి తూరుప్పేట ఓటర్లకి ఓటు కొక్కంటికి కిలోబియ్యం యిచ్చే కార్యక్రమానికి లాంఛనంగా ప్రారంభోత్సవం చెయ్యటంతో సభ జయప్రదంగా ముగిసింది.

* * *

సుభాస్ చంద్రబోసు విగ్రహం దగ్గర పార్టీ ఉపాధ్యక్షుడు చెంచురామయ్య అధ్యక్షతన నాయుడప్పలస్వామి మీటింగు పెట్టాడు.

"చినవెంకట రాయుడి మాటలూ, చేతలూ అన్నీ బూటకాలు. తాత్కాలికంగా మిమ్మల్ని ఆకర్షించి ఓట్లు దోచుకోటానికి ఆడే నాటకాలు. కూడు గుడ్డ నోచుకోని బీద ప్రజానీకం అలాటి మాటలు నమ్మి ఎంతో కాలం మోసపోయారు. ఇంక మోసపోరు. మేం పోనివ్వం. తూరుప్పేట ఓటర్ల సంక్షేమం మా పార్టీ ధ్యేయం. మా పార్టీ లక్ష్యం. అంతేగాకుండా మా పార్టీ గమ్యం. గృహనిర్మాణ పథకం. వెనువెంటనే చేపట్టటమే గాకుండా ఓటర్లకు బ్యాంకుల ద్వారా దీర్ఘ కాలిక ఋణాలు యిప్పించటం. రిక్షాలు, గేదెలు కొనుక్కునే సదుపాయాలు కల్పించడం మా పార్టీ చేపట్టిందని గౌరవనీయులైన ఉపాధ్యక్షులు శ్రీ చెంచు రామయ్యగారు యిప్పుడే చెప్పారు. ఓటరు కొక్కంటికి యాభై రూపాయల ఋణం యిచ్చే పథకానికి శ్రీ చెంచురామయ్యగారు యిప్పుడే ప్రారంభోత్సవం చేస్తారు.

చెంచురామయ్యగారు ఒక పురుషుడికి



# గోపీచంద్ హృదయ విలాపం

కన్న కలలు కరిగి, విరిగి, చితికి,
చివికి
కన్నీళ్ళు కురిసి, కురిసి– ఆ కన్నీటి
మడుగులోనే మునిగిపోతే–
వయసులో వృద్ధాప్యం
రాకుంటుందా?

---

ఒక స్త్రీకి, ఒక యువకుడికి తలో యాభై యివ్వడంతో సభ దిగ్విజయంగా ముగిసింది.

* * *

ఓటరు కొక్కంటికి రోజుకి రెండు కిలోల బియ్యం, యాభై రూపాయలు యివ్వమని పార్టీ ఆదేశిస్తే అందులో చెరిసగం రాయుడు, అప్పురెడ్డి పంచుకు భోంచేశారని అప్పలస్వామి ప్రచారం చేశాడు.

ఓటరు కొక్కంటికి నూటయాభై రూపాయల ఋణం, నాలుగు జతల బట్టలు యిమ్మని పార్టీ ఆదేశిస్తే అందులో మూడొంతులు అప్పలస్వామి, చెంచురామయ్య నంజుకు తిన్నారని రాయుడు ప్రచారం చేశాడు.

రాయుడు స్థలంలో అప్పురెడ్డి గృహనిర్మాణ పథకానికి శంకుస్థాపన చేశాడు.

పడమటి దిక్కున అప్పలస్వామి స్థలంలో చెంచురామయ్య శంకుస్థాపన చేశాడు.

ఆ కాండ ముగిశాక రాయుడు చింతామణి నాటకంవేయించాడు. అప్పలస్వామి కవి సమ్మేళనం పెట్టించాడు.

అంతలో హైద్రాబాద్ నించి టెలి

> చరిత్రకు ముగింపు అధ్యాయం లేదు.
>
> —సలైన్
>
> టెలిఫోన్ అనేది అన్ని అసౌకర్యాలలోకెల్లా పెద్ద సౌకర్యం. అన్ని సౌకర్యాలలోకెల్లా పెద్ద అసౌకర్యం.
>
> —రాబర్ట్ విండ్

ఫోనుల్లో మాటలు ప్రవహించాయి. అప్పురెడ్డి, చెంచురామయ్యా కంగారులో కలిసి వెళ్ళి విడివిడిగా ఫోను అందుకున్నారు.

* * *

పెదగాంధీ బొమ్మదగ్గర చిన వెంకట రాయుడు, బోసుబాబు విగ్రహం దగ్గర నాయుడప్పలస్వామి తూరుప్పేట ఓటర్లకి ఆ పూట భోజనాలు యేర్పాటుచేశారు.

మధ్యాన్నం రెండింటికల్లా రెండుచోట్లా వంటలు తయారయ్యాయి.

ఫోనులోమాటాడ్డానికి వెళ్ళినఅప్పురెడ్డి, చెంచురామయ్యల రాకకోసం వడ్డనలు ఓ గంట ఆపారు.

అప్పురెడ్డి - అప్పలస్వామి సంతర్పణ దగ్గరకీ,

చెంచురామయ్య- రాయుడు సంతర్పణ దగ్గరికిరావటం చూసి తూరుప్పేటలోఅగ్నిహోత్రుడు తెల్లబోయాడు. అప్పలస్వామికి అప్పురెడ్డి, రాయుడికి చెంచురామయ్య పార్టీల్లో పై వర్గాల్లో అకస్మాత్తుగా వచ్చిన పరిణామాలు, మార్పులు క్లుప్తంగా వివరించి చెప్పి, తాడిత ప్రజానీకం యింక ఆకలితో అల్లాడటానికి వీల్లేదని వడ్డనలు కానిమ్మన్నారు. కాని, తానొకటి తలచిన దైవమొకటి తలచును.

ఊళ్లోవున్న ఒక్కగానొక్క ఫైరింజను రిపేర్లో వున్నట్టే, ఒక్కగానొక్క ఫొటోగ్రాఫరుగారి కెమేరాకూడా రిపేరులో వుండిపోయింది.

పెదగాంధీ బొమ్మదగ్గర రాయుడు అన్నం వళ్ళెంతోను. చెంచురామయ్య పులుసు గిన్నెతోనూ,

బోసుబాబు విగ్రహం దగ్గర అప్పలస్వామి పులిహోర వళ్ళెంతోనూ. అప్పురెడ్డి మజ్జిగన్నం బకెట్‌తోనూ కింకర్తవ్యతా మూఢులై బొమ్మల్లా నిలబడిపోయారు.

తూరుప్పేటలో యిళ్ళు తగలడుతూనే వున్నాయి.

[మిత్రుడు డాక్టర్ రమేష్‌కి చదివి వినిపించలేకపోయిన కథ అతని గుర్తు కోసం.] ★